

ఆదివారం ఎల్బీనగర్‌లో జరిగిన బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ రెడ్డి

# 2014కు ముందు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లున్నది.!

**హైదరాబాద్ అభివృద్ధిని ప్రజలకు వివరించండి**

- మనం చేసిన అభివృద్ధి పనుల వద్ద సెల్ఫీలు దిగాలి.. వీడియోలు తీయాలి..
- యువత సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకోవాలి
- పోస్టులతో దుమ్ములేపాలె.. దమ్ము చూపాలె
- 30 రోజుల పాటు కష్టపడాలి..
- ప్రతి ఓటరును ఒకటికి పదిసార్లు కలవాలి..
- తొమ్మిదిన్నరేండ్లలో మనం ఏం చేశాం.. మళ్లీ అధికారంలోకి రాగానే.. ఏం చేస్తామనేది చెప్పాలి
- కాంగ్రెస్ వస్తే జరిగే నష్టాలను పూసగుచ్చినట్లు ప్రజలకు వివరించాలి
- ప్రతి నియోజకవర్గంలో బూత్ స్థాయి నాయకుల సమావేశం ఏర్పాటు చేయండి
- ఎల్బీనగర్ వేదికగా గ్రేటర్ గులాబీ శ్రేణులకు మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం

**2014 కంటే ముందు హైదరాబాద్ నగరం ఎలా ఉండే.. ఇప్పుడు ఎలా ఉన్నది.. మనం చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనబడుతున్నది. ప్రతి గులాబీ సైనికుడు ప్రతి ఇంటికి వెళ్లాలి.. ప్రతి ఓటరును కలవాలి. తొమ్మిదిన్నర ఏండ్లలో మనం చేసిన అభివృద్ధిని కండ్లకు కట్టినట్లు వివరించాలి. 65 ఏండ్ల కాంగ్రెస్, బీజేపీ పార్టీల పాలనకు, బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదిన్నర ఏండ్ల పాలనకు తేడా ఏమిటనేది ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి.**

**మనం చేసిన అభివృద్ధి ప్రజల కండ్లముందు ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనుల వద్ద సెల్ఫీలు, వీడియోలు తీయండి.. 30 రోజుల పాటు సోషల్ మీడియాలో దుమ్ము లేపేలా పోస్టులు చేసి దమ్ము చూపండి. ప్రతి గులాబీ సైనికుడు ఈ నెల రోజులు కష్టపడాలి. తొమ్మిదిన్నరేండ్లలో మనం ఏం చేశాం.. మళ్లీ అధికారంలోకి రాగానే ఏం చేస్తామనేది చెప్పాలి.**

**2014లో ఎల్బీనగర్ చౌరస్తా ఎట్లుండే.., విద్యుత్ కష్టాలు ఎట్లుండే.., నీటి కష్టాలు ఎట్లుండే.., ఇప్పుడెట్లుంది అనే విషయాలను ప్రస్తావించి సెల్ఫీలు దిగాలన్నారు. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేయాలన్నారు. మనం నిర్మించిన ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు, నీటి ట్యాంకుల వద్ద ఫొటోలు దిగి "నాడు-నేడు" ఫొటోలతో సోషల్ మీడియాలో దుమ్ములేపాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.**

**కాంగ్రెస్ అంటే అంధకారం, కాంగ్రెస్ అంటే కష్టాలు, కాంగ్రెస్ అంటే మత కల్లోలాలు, కాంగ్రెస్ అంటే దృష్టపాలన, అన్నింటి కంటే మించి కాంగ్రెస్ హయాంలో కర్ఫ్యూల గురించి ప్రజలకు చెప్పాలి. ముఖ్యంగా నాడు కరెంట్ ఉంటే వార్త.. నేడు కరెంట్ పోతే వార్త లాంటి అంశాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి. నాటి కాంగ్రెస్ పాలనకు, నేడు బీఆర్ఎస్ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి.**

సిటీబ్యూరో/ వనస్థలిపురం, అక్టోబర్ 29 : ప్రపంచ నగరాలతో పోటీ పడే విధంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా తీర్చిదిద్దామని ఐటీ శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రతి ఒక్క గులాబీ సైనికుడు ఛాతి మీద చేయి వేసుకొని సగర్వంగా ప్రజలకు చెప్పవచ్చన్నారు. ప్రతి నియోజకవర్గంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని, క్రమ శిక్షణతో, ప్రణాళికతో ప్రతి ఓటరును కలిసి వివరించాలని మంత్రి కేటీఆర్ సూచించారు. ఆదివారం ఎల్బీనగర్ వేదికగా జరిగిన బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో గ్రేటర్ బీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. యువత సోషల్ మీడియాను అస్త్రంగా చేసుకొని 30 రోజుల పాటు కష్టపడాలని సూచించారు.

## ఎల్బీనగర్ రూపురేఖలు మార్చిన ఘనత మనదే

ఎల్బీనగర్‌ను వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేసి, రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఎల్బీనగర్, నాగోల్, బైరమాల్ గూడ చౌరస్తాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించి ట్రాఫిక్ సమస్య లేకుండా చేశామని, ఫతుల్లగూడలో మూడు మతాల శ్మశాన వాటిక అద్భుతంగా నిలిచామన్నారు. దేశం మొత్తం మత విద్వేషం రేపుతున్నారని, కానీ ఇక్కడ మూడు మతాలు ఒకేచోట కలిసి ఉండేలా నిర్మాణం చేశామని గుర్తు చేశారు. మూసీపై వంతెన నిర్మాణం చేపడుతామని తెలిపారు. మెట్రోను హయత్‌నగర్ వరకు పొడిగించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారని, మన సీఎం పెద్ద అంబర్‌పేట్ వరకు మెట్రోను పొడిగిస్తున్నట్లు ప్రకటించారన్నారు. విద్యా, వైద్యం, అభివృద్ధి, మౌలిక వసతులలో ఎల్బీనగర్‌కు ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.




## మలక్‌పేట్‌లో రెండేళ్లలో ఐటీ టవర్

టీవీ టవర్ ఫేమస్‌గా ఉన్న మలక్‌పేట్‌లో రెండేళ్లలో ఐటీ టవర్ నిర్మిస్తామని, తద్వారా 20 నుంచి 25వేల మంది యువతకు కొలువులు కల్పించే బాధ్యత తమదేనని మంత్రి కేటీఆర్ చెప్పారు. పక్కనే ఉన్న మెట్రో నుంచి ఐటీ టవర్‌కు స్కైవాక్ నిర్మించి అద్భుతంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న రిజిస్ట్రేషన్ల సమస్యను 118 జీవోతో పరిష్కరించామన్నారు. అందులో ఉన్న చిన్న చిన్న లోపాలను సరిచేస్తామని హామీ ఇచ్చారు. పారాచూట్ నేతలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి ఏం తెలుసు..

ఎల్బీనగర్‌లో ఏ దిక్కు, ఏ మూల తెలియని మధుయాష్కీ అనే వ్యక్తి కాంగ్రెస్ అభ్యర్థిగా వచ్చాడని, ఆయన తెలుసుకునేలోపే ఎన్నికలు ఐపోతాయని కేటీఆర్ అన్నారు. ఎల్బీనగర్‌లో ప్రజల అవసరాలు, సమస్యలు ఆయనకేమైనా తెలుసా.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని అడిగితే ఏ కాలనీలో ఏ సమస్య ఉందో, ప్రజలకు ఏం కావాలో చెబుతాడన్నారు. అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్లు, ప్రజలతో వ్యక్తిగత గుర్తింపు ఉన్న నాయకుడు సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నా పదవిని త్యాగం చేయడానికి సిద్ధమనే నాయకుడు సుధీర్‌రెడ్డి అని తెలిపారు. కులం కన్నా గుణం ముఖ్యం. కులం పేరుతో ఓట్లు అడిగే నాయకులను నమ్మొద్దని సూచించారు. కాంగ్రెస్ కులం అంటుంది, బీజేపీ మతం అంటుంది.. మన మధ్యన విద్వేషాలు రేపే వారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఒకటికి పది సార్లు ప్రతి ఓటరును కలవండి..

సభలో బూత్ స్థాయి నాయకులకు కేటీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరును కలిసి మనం ఏం చేశామో, ఏం చేస్తామో వివరించాలన్నారు. అపోహలుంటే తొలగించాలని సూచించారు. స్వాతి ముత్యం సినిమాలో కమల్‌హాసన్ పాత్రను గుర్తు చేశారు. ఒకటికి పది సార్లు ఓటరును కలిసి వారిని చైతన్యం చేయాలన్నారు. మన మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి విషయాన్ని వివరించాలన్నారు. కాంగ్రెస్ వస్తే జరిగే నష్టాలను పూసగుచ్చినట్లు చెప్పాలన్నారు. ఎల్బీనగర్ చౌరస్తాకు శ్రీకాంతాచారి పేరు పెట్టామని, పనామా చౌరస్తాకు మహా నాయకుడు ఎన్టీఆర్ పేరు పెట్టామన్నారు. కులం, మతం, జాతి, ప్రాంతం వంటి ఎలాంటి బేధాలు బీఆర్ఎస్ పార్టీకి లేవన్నారు. సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతాయన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.



# బీఆర్ఎస్ బీసీల ప్రభుత్వం

- బీసీల సంక్షేమానికి అనేక పథకాలు తెచ్చి అమలు పరిచాం
- చేతి వృత్తుల వారికి లక్ష రూపాయలు అందించాం
- 70 ఏండ్లుగా చేయని కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు బీసీలకు చేస్తాయంటే నమ్మాలా..?
- మొదట కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలి
- 'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకావిష్కరణలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సిటీబ్యూరో, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): బీసీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు పర్చారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ రాసిన 'బీసీ ఆత్మగౌరవ భవనాలు' పుస్తకాన్ని ఆదివారం మంత్రి నివాసంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల జీవన ప్రమాణాలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్మాణాత్మకంగా కృషి చేస్తూ వస్తుందని అన్నారు. చేతి వృత్తుల జీవితాలకు భరోసా కల్పించామని, దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ఆత్మగౌరవ భవనాలు కట్టించామని తెలిపారు. మత్స్య, నేత, గీత, యాదవ, రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వకర్మ, అత్యంత వెనుకబడిన బీసీ వర్గాలను ఆదుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. చేతి వృత్తుల వారికి లక్ష రూపాయలు అందించామని తెలిపారు. బీసీలకు అండగా నిలిచిన ప్రభుత్వానికి బహుజనులు కూడా అండగా నిలుస్తారని చెప్పారు. బీజేపీ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాటలు పచ్చి బూటకమని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు బీసీ ఓట్ల మీద ఉన్న శ్రద్ధ బీసీల జీవన ప్రమాణాలు పెంచడంపై లేదని మండిపడ్డారు. బీసీ జనగణన చేయమంటే పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్‌లు బీసీలకు మేలు చేస్తామని చెప్పడం ఆశ్చర్యంగా ఉన్నదని తెలిపారు. మొదట కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలు అంబానీ, ఆదాని లాంటి వారికి రక్షకులుగా మారారనే తప్పు.. 'సంపద పెంచడం, సంపద పంచడం'పై కనీస ఆలోచన చేయలేని విమర్శించారు. రచయిత జూలూరు మాట్లాడుతూ.. బహుజనులకు సాయం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనిక ఆలోచనలకు ఆచరణ రూపంగా బీసీలు నిలిచి తీరుతారని, కేసీఆర్ ప్రభుత్వానికి వెన్ను దన్నుగా ఉంటారని అన్నారు.